క్లుప్తంగా

విద్యార్థికి వాసుపల్లి చేయూత



విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: తండ్రి చనిపోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద విద్యార్థి కళాశాల ఫీజుకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.6 వేలు సాయమందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే మహిళలకు వరాలజల్లు కురిపిస్తానన్న చంద్రబాబు వారికి ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్లకే పెన్షన్, జీరో వడ్డీ రుణాలంటూ మేనిఫెస్టోలో పలు హామీలు పెట్టారన్నారు. పవిత్ర గ్రంథం వంటి మేనిఫెస్టోను ఆయన మరోసారి అపహాస్యం చేశారని మండిపడ్డారు. అర్హత ఉండి కూడా తల్లికి వందనం 50 శాతం మహిళలకు రాకుండా చేశారన్నారు. పేదలతో ఆటలాడుకుంటే కూటమి ప్రభుత్వానికి త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని వాసుపల్లి హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా బస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



అల్లిపురం: ద్వారకా బస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం ద్వారకాబస్ స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌కు సమీపంలోని దుకాణాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు టూటౌన్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతి చెందిన వ్యక్తి ముక్కు నుంచి రక్తం కారుతుండటం గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని తెలిపారు. అతని కోసం చుట్టుపక్కల వారిని విచారించినా అతను ఎవరో తెలియదని తెలపడంతో గుర్తు తెలియని వ్యక్తిగా భావించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆచూకి తెలిసిన వారు 9440904716 సంబరుకు తెలపాలని కోరారు.

మత్తుతో జీవితాలు చిత్తు



కాన్వెంట్ కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల, ఈగల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కాన్వెంటు కూడలిలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ మాట్లాడుతూ మత్తుతో యువత జీవితాలు చిత్తు చేసుకుంటున్నారన్నారు. జ్ఞానాపురం కళాశాల నుంచి కాన్వెంట్ కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మత్తు పదార్థాలకు నో చెప్పండి -మంచి జీవితాన్ని ఎంచుకోండి'అనే నినాదాలతో మానవహారం నిర్వహించారు. మత్తు పదార్థాల వ్యతిరేక దినం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ హేమ, జంతుశాస్త్ర విభాగాధిపతి, ఈగల్ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ ఈ.హరిణి, డాక్టర్ సుధా ప్రియా, ఎల్. ప్రవీణ్‌కుమార్, కె.మాణిక్య కుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపు విశ్వ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ఎంప్లాయీస్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 6న విశాఖలో తెలుగు విశ్వబ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధి ప్రకాశరావు, ఏల్చూరి రామారావు, ఎల్‌వీ రమణమూర్తి, ఎస్ఎస్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మురళీనగర్ బీవీఆర్ గ్రాండ్‌లో నిర్వహించనున్న పరిచయ వేదికకు ఆంధ్ర, తెలంగాణ తెలుగు విశ్వబ్రాహ్మణులే కాక పరిసర రాష్ట్రాల్లో ఉన్న తెలుగు విశ్వబ్రాహ్మణులు హాజరు కావచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని విశ్వబ్రాహ్మణులు వినియోగించుకోవాలని నిర్వాహకులు తెలిపారు. 8500669765, 9440634249 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కాదు శుద్ధ జలం.. అంతా గరళం



ఆటోలో తరలిస్తున్న వాటర్ క్యాన్లు



పాతనగరంలోని ఓ షాపులో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్

పూర్ణామార్కెట్ పరిసరాల్లో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్

జగదాంబ: మినరల్ వాటర్ అంటే భూమిలో నుంచి వచ్చిన నీటిలో మినరల్స్‌ను ఉపయోగించి ఫిల్టర్ చేసి అందిస్తారు. దీని ధర ఎక్కువగా ఉంటుంది. అలాగే బాటిల్‌పై ఐఎస్ఐ మార్కు కూడా ఉంటుంది. ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్‌లో మినరల్స్ ఉండవు. కెమికల్స్ ఉపయోగించి నీటిని ఫిల్టర్ చేస్తారు. దీని ధర తక్కువ ఉంటుంది. దీనినే వాటర్ ప్లాంట్ల వ్యాపారులు మినరల్ వాటర్ పేరుతో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు సొంతంగా చిన్నచిన్న వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని 20 లీటర్ల క్యాన్లు విక్రయిస్తున్నారు. ఇవి ఎంత వరకు శుద్ధి చేయబడ్డాయో ఆ దేవుడికే తెలియాలి.

కఠిన నిబంధనలు దాటాలి..

వాస్తవంగా ఎవరైనా ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలనుకుంటే ముందుగా ఆ ప్రాంతంలో స్థల పరిశీలన, ఆ ప్రాంతంలోని నీటిలో ఎంత శాతం సున్నం ఉందో ఫుడ్‌సేఫ్టీ అధికారులుతో పరీక్షలు చేయించుకోవలసి ఉంటుంది. తదుపరి తగిన లైసెన్సు పొంది ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలి. అప్పటికీ ప్లాంట్ ఏర్పాటుకు ఐఎస్ఐ మార్కు తప్పనిసరి. కానీ వీధుల్లో కొందరు ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా నీటి విక్రయాలకు తెగబడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. వాటర్ ప్లాంట్లకు ఐఎస్ఐ మార్కు రావాలంటే నీటి పరీక్షలు చేసిన రిపోర్టులు ప్రభుత్వానికి అందజేయాలి. దీనికి సంబంధించి ఖర్చు కూడా ఎక్కువే అవుతుంది. నాణ్యతా ప్రమాణాల్లో ఏమాత్రం రాజీ పడినా ఐఎస్ఐ మార్కు రాదు. అందుకే చాలా మంది వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేస్తున్నారు.

రోగాలమయం..

గతంలో సంగతి ఎలా ఉండేదో తెలియదు కానీ ఈ రోజుల్లో చాలా మంది ఆర్‌వో ప్లాంట్ల పైనే ఆధారపడుతున్నారు. ఇళ్లలో మున్సిపల్ కుళాయి, మోటారు ఉన్నప్పటికీ తాగునీటి అవసరాలకు ప్యాకేజ్డ్ వాటర్ బాటిళ్లనే వాడుతున్నారు. ఈ నేపథ్యంలో పాతనగరంలో చాలా వరకు అనధికారికంగా వాటర్ ప్లాంట్లు పెట్టుకుని నీటిని విక్రయిస్తున్నారు. వీటిలో ప్రభుత్వ నిబంధనలు ఎంత వరకు పాటిస్తున్నారో.. ఆ నీరు ఎంత స్వచ్ఛమైనదో నిర్ధారిత పరీక్షలు చేసిన నాథులు లేరని పలువురు వాపోతున్నారు. ఒక్క జీవీఎంసీ 35వ వార్డులోనే రెండు ఆర్‌వో ప్లాంట్లు ఉన్నాయి. దీనిని బట్టి చూస్తే జోన్-4 పరిధిలోని 12 వార్డుల్లో ఎన్ని ఆర్‌వో ప్లాంట్లు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఏం ఉండాలి

- 3 వేల నుంచి 5 వేల చదరపు అడుగుల స్థలం ఉండాలి.
- 65 హెచ్‌పీ పవర్ గల ప్రాసెసింగ్ మోటార్ ఉండాలి.
- ప్రాజెక్ట్ వ్యయం దాదాపు రూ. 75 లక్షల వరకు ఉంటుంది. ఇందులో యంత్రాలు, యుటిలిటీ, ఫర్నిచర్ వంటి ఖర్చులు ఉంటాయి.
- ఒక లీటర్ వాటర్ బాటిల్ తయారీకి 1.39 లీటర్ల నీరు అవసరం అవుతుంది.
- వాటర్ ప్లాంట్ ఏర్పాటు అనేది చిన్న తరహా పరిశ్రమల జాబితా కిందకి వస్తుంది కాబట్టి ఆ క్యాటగిరీలో పరిశ్రమను నమోదు చేయించాలి.
- బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నుండి ఐఎస్ఐ సర్టిఫికెట్ పొందాలి.
- కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి.
- పని చేసే కార్మికుల తాలూకు వైద్య ధ్రువీకరణ పత్రాలు ఉండాలి.
- ట్రేడ్‌మార్క్ నమోదు ఉండాలి.
- ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన స్థలం తాలూకు పత్రాల వివరాలు ప్రభుత్వానికి నివేదించాలి.
- మంజూరు లే అవుట్ ప్రణాళిక ఉండాలి.

ఈ చర్యలు తప్పనిసరి

- అనధికారికంగా ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలి
- ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి జోనల్ స్థాయి అధికారులు పర్యవేక్షించేలా నిబంధనలు రూపొందించాలి.
- ప్రస్తుతం ఉన్న ఆర్‌వో ప్లాంట్లన్నింటికీ సంబంధిత అధికారులతో పరీక్షలు చేయించి మినరల్ వాటర్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి.
- ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నకిలీ ఆర్‌వో ప్లాంట్లను మూసేయాలి.
- ప్లాంట్లలో నీటిని శుద్ధి చేసే పరికరాలు, వాటర్ క్యాన్లు, ప్లాంట్ వద్ద పరిశుభ్రతపై పర్యవేక్షణ చేయాలి.
- ఆర్‌వో ప్లాంట్, వాటర్ బాటిల్స్‌పై ఉన్న ఐఎస్ఐ ముద్రకు సంబంధించి పరిశీలించాలి. నిజంగా ఐఎస్ఐ మార్కు జారీ చేయబడినట్లయితే ఆ విషయం ప్రజలకు తెలిసేలా డిస్‌ప్లే చేయాలి.

వైఎస్సార్‌సీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాత్రపల్లి వేళాంగిణిరాజు భార్య పద్మలత గురువారం మృతి చెందారు. ఈ మేరకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, పార్టీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ శుక్రవారం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. పార్టీ సీనియర్ నాయకుడు వేళంగిణిరాజుకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.వేళాంగిణిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, దాలిబాని మధు, ఆనందరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ విమల విద్యాలయాన్ని తక్షణం తెరవాలి

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన విశాఖ విమల విద్యాలయాన్ని నేటికీ ప్రారంభించకుండా కూటమి ప్రభుత్వం తీవ్ర ఆటంకాలు సృష్టిస్తుందని, స్కూల్ మూసివేతకు కుట్ర పన్నుతోందని, ఈ చర్యను సీపీఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు ఆరోపించారు. విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యే విమల విద్యాలయాన్ని మూసివేస్తున్నారు కనుక టీచర్లకు వీఆర్ఎస్ ఇచ్చి పంపించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి ఇచ్చిన లెటర్లు వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.జగన్‌తో కలిసి మీడియా సమావేశంలో గంగారావు మాట్లాడారు. వీరి చర్యల వల్ల 1600 మంది విద్యార్థులు నడిరోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని, తక్షణమే స్కూల్‌ని ప్రారంభించేలా విశాఖ ఎంపీ, స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని సీపీఎం కోరుతుందన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ సేవలు



అధికారులతో సమీక్షిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: నగర పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిర్వహణ అవసరమని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో ట్రాఫిక్ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రామరాజు, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రోడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అమలుకు దేశంలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఆహ్వానించామన్నారు. నొయిడా నుంచి మెటాఫ్యుజిన్, నెక్, బెంగళూరు నుంచి డాటా క్రాప్, ముంబై నుంచి సీఎంఎస్ కంప్యూటర్స్, హైదరాబాద్ నుంచి బృహస్పతి టెక్నాలజీస్ వంటి కంపెనీలు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కంపెనీలు శుక్రవారం విశాఖ కలెక్టరేట్‌లో ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ వద్ద ప్రజంటేషన్స్ ఇచ్చాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ ద్వారా పరిమితికి మించి వేగంగా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, రెడ్ సిగ్నల్స్‌ను ధిక్కరించి ప్రయాణం చేయడం, రాంగ్ పార్కింగ్ వంటివి కనిపెట్టి ఆటోమేటిక్‌గా ట్రాఫిక్ చలానా జారీ జరుగుతుందన్నారు.

జ్వరాల నియంత్రణకు సమర్థవంతంగా పని చేయండి



రంగిరీజు వీధిలో నీటి నిల్వలు పరిశీలిస్తున్న డాక్టర్ మీనాక్షి

డాబాగార్డెన్స్: వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాపించకుండా దోమల నియంత్రణ చర్యలు సమర్థవంతంగా చేపట్టాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆమె 36వ వార్డు రంగిరీజు వీధిలో పర్యటించారు. క్షేత్ర స్థాయిలో దోమల నియంత్రణకు జరుగుతున్న ఫ్రైడే డ్రైడే యాక్టివిటీ, యాంటీ లార్వా ఆపరేషన్లు, దోమల మందు స్ప్రేయింగ్, ఫీవర్ స్క్రీనింగ్ పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు పెరిగే ప్రదేశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అలాగే దోమలు పెరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో మహిళలకు, స్థానికులకు వివరించాలన్నారు. యాంటీ లార్వా సిబ్బంది సుమారు 400 మంది నియామకం జరిగింది కాబట్టి ఇంటింటికీ సిబ్బంది తిరిగి దోమ లార్వాలు ఎలిమినేషన్ చేసే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. యాంటీ లార్వా సిబ్బంది కేవలం గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే చూసి వెళ్లిపోకుండా మేడపై అంతస్తులు కూడా తనిఖీ చేయాలని సూచించారు. అలాగే రంగిరీజు వీధిలో మలేరియా బారిన పడిన మహిళ ఇంటి పరిసరాలను పరిశీలించారు. అక్కడ జరిగిన యాంటీ లార్వా ఆపరేషన్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మలేరియా కె.వి.ఎస్.ప్రసాదరావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరావు, జీవీఎంసీ అధికారులు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, యూపీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్

డాబాగార్డెన్స్: దేశ నిర్మాణంలో స్థానిక సంస్థల పాత్రపై హర్యానాలో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా శుక్రవారం లోక్‌సభ పార్లమెంట్ కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొని జీవీఎంసీ అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఆ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, డిప్యూటీ స్పీకర్ కృష్ణలాల్ మిడ్డా, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ, కేంద్ర పట్టణ గృహ శాఖ మంత్రి మనోహర్ లాల్, హర్యానా శాసనసభ స్పీకర్ హర్విందర్ కల్యాణ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్ ప్రమోద్ చంద్ర మోదీ పాల్గొన్న కార్యక్రమంలో మేయర్ పీలా జీవీఎంసీ అభివృద్ధికి సంబంధించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మున్సిపల్ పాలన, రాజ్యాంగ ఆదేశాన్ని నెరవేర్చడంలో దాని ప్రభావాన్ని మెరుగుపరచడం, కీలక రంగాల బలోపేతం తదితర అంశాలు చర్చించినట్లు తెలిపారు.

9న ఆటోల బంద్ జయప్రదం చేయండి

డాబాగార్డెన్స్: దేశ వ్యాప్తంగా అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ఈ నెల 9వ తేదీ సమ్మెలో భాగంగా ఆటోలు బంద్ చేయాలని అఖిలపక్ష ఆటో కార్మిక సంఘం నాయకుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో మోటార్ కార్మికులపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అనేక నిబంధనలు విధించిందని, తద్వారా ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. సిటు నాయకుడు కె.సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానన్న చంద్రబాబునాయుడు ఆటో మోటార్ కార్మికులకు వాహన మిత్ర ఇవ్వకుండా ప్రకటన చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కాసీబాబు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటవిక పాలనకు చరమగీతం పాడాలి

వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' పేరిట చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు గుర్తు చేస్తూ వైఎస్సార్‌సీపీ చేపడతున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని నియోజకవర్గం పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ నెల 5న జిల్లా పార్టీ ఆధ్వర్యంలోనూ, ఈ నెల 8న నియోజకవర్గం ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గణేష్‌కుమార్ మాట్లాడారు. నియోజకవర్గ స్థాయి నుంచి వార్డు, గ్రామ స్థాయి వరకు బాబు పాలనలో ష్యూరిటీ లేదు.. పథకాలకు గ్యారంటీ లేదనే నినాదాన్ని ప్రజల్లో తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు చేస్తున్న మోసాలు, కుట్రలు ప్రజలకు వివరించి చైతన్యపరచాలన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి పనులు, కూటమి ప్రభుత్వంలో నేడు అమలవుతున్న నిరంకుశ పాలనపై ప్రతి గడపలో క్లుప్తంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథునికి హోం మంత్రి పట్టువస్త్రాల సమర్పణ



హోం మంత్రి అనితకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో రాజగోపాల్‌రెడ్డి, ఫెస్టివల్ ఆఫీసర్ అన్నపూర్ణ

డాబాగార్డెన్స్ : జగన్నాథస్వామి దశవతారాల్లో భాగంగా స్వామి శుక్రవారం శ్రీరామవతారంలో దర్శనమిచ్చారు. పలు ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతున్న ఉత్సవాల్లో ఫెస్టివల్ ఆఫీసర్ టి.అన్నపూర్ణ, పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 1200 మంది భక్తులకు అన్న సమారాధన జరిపారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, యేడిద సురేషుబాబు ఆధ్వర్యంలో పూజలు జరిపారు.

పట్టువస్త్రాల అందజేత..

రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట పాండురంగస్వామి ఆలయం తరపున ఆలయ ఈవో దివ్యతేజతో కలిసి స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ, ఆలయ ఈవో రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికి, దర్శనం కల్పించి బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరికీ దశవతారాల్లో స్వామి దర్శన భాగ్యం కల్పిస్తున్నారన్నారు. ఏటా జగన్నాథస్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ అన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని స్వామిని ప్రార్థించినట్టు చెప్పారు. జగన్నాథస్వామికి రామతీర్థం రామచంద్రస్వామి దేవస్థానం నుంచి సహాయ కమిషనర్, ఈవో వై.శ్రీనివాసరావు దంపతులు, సీనియర్ అసిస్టెంట్ డి.రామారావు, స్థానాచార్యులు గొడవర్తి నరసింహాచార్యులు, ప్రధానార్చకుడు ఖండవిల్లి కిరణ్‌కుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు.

మహోజ్వల శక్తి 'అల్లూరి'

పలు చోట్ల సీతారామరాజుకు ఘన నివాళి



అల్లూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, అధికారులు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్: మన్యం వీరుడు అల్లూరి విగ్రహాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేయాలని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ కోరారు. శుక్రవారం స్వామి వివేకానంద సంస్థలో అల్లూరి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు సీహెచ్ అప్పారావు, టి.కృష్ణ, పాత్రుడు, సంస్థ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

- విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫిజికల్ డైరెక్టర్ ఆర్. కిరణ్మయి, ఎకనామిక్స్ ఇన్‌చార్జి డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ కె.గీతాంజలి, చరిత్ర అధ్యాపకురాలు ఎస్.రాజేష్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.
- ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి అల్లూరి సీతారామరాజు జయంతి కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. కళాశాలలో ఉన్న అల్లూరి విగ్రహానికి ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీవో డాక్టర్ అర్చన, గాంధీ, గోపీకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
- అల్లూరి స్ఫూర్తితో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రత్యేకాంధ్ర సాధన నాయకుడు చలసాని శ్రీనివాస్, పోరాట కమిటీ చైర్మన్లు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, పోరాట కమిటీ కన్వీనర్ కేఎస్ఎన్ రావు, కో కన్వీనర్ అయోధ్యతో పాటు విశాఖ జిల్లా కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ప్రతినిధులు పాల్గొని ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎంపీల సహకారం కోరి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. విశాఖ జిల్లా కార్మిక ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్లు ఎం.మన్మథరావు, సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు ఎస్.కనకారావు తదితరులు పాల్గొన్నారు.
- **అల్లూరి విజ్ఞాన కేంద్రంలో..**

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతిని కేంద్రం నిర్వాహకులు నిర్వహించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం, గురజాడ సాంస్కృతి వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రం ట్రస్ట్ ఛైర్మన్ సీహెచ్ నరసింగరావు, నేషనల్ బాక్సింగ్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ రవిరాజు, మన్యం ధీరుడు సినీ నిర్మాత ఆర్‌వీవీ సత్యనారాయణ, కన్సర్న్ ట్రస్ట్ చైర్మన్ పీకే జోస్, అల్లూరి విజ్ఞాన కేంద్రం కోశాధికారి వీఎస్ పద్మనాభరాజు, కార్యక్రమాల ఇన్‌చార్జి జీఎస్ రాజేశ్వరరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లూరి జీవితం యువతకు ఆదర్శం

మహారాణిపేట: జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన అల్లూరి జయంతి కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, రాష్ట్ర పంచాయతీరాజ్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు పీవీవీఎస్ మూర్తి, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎ.మన్మోహన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మన్యం వీరుడికి ఘన నివాళి..

కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, డీఆర్‌డీఏ, యూసీడీ పీడీలు లక్ష్మీపతి, సత్యవాణి, ఎల్డీఎం శ్రీనివాసరావు, నాబార్డు ఏజీఎం బసంత్ కుమార్ తదితర అధికారులు మన్యం వీరుడి అంజలి ఘటించారు.

కుటుంబం చెంతకు వృద్ధురాలు



గంగమ్మను ఆమె సోదరుడికి అప్పగిస్తున్న సోషల్ వర్కర్ పింకీ జెన

అల్లిపురం: చిన్నతనం నుండి మానసిక వ్యాధితో బాధపడుతూ రోడ్లపై తిరుగుతుండే గంగమ్మ (60)కు ఏయూటీడీ సిబ్బంది ఈ ఏడాది జనవరిలో ఆశ్రయం కల్పించారు. శ్రద్ధా సంస్థ చికిత్స అందించడంతో ఆమె కోలుకుంది. దీంతో ఆమె తనకు చిన్నప్పటి నుంచి ఈ జబ్బు ఉందని, పెళ్లి కాలేదని తెలిపింది. తల్లిదండ్రులు తన 30వ ఏట చనిపోవడంతో జబ్బు మరింత ముదిరి కర్ణాటక రాష్ట్రం, బళ్ళారి దగ్గర దసరానగీనహళ్లి గ్రామం వదిలి వైజాగ్ వచ్చేసాని తెలపటంతో గంగమ్మను సోషల్ వర్కర్ పింకీ జెన వైజాగ్ నుంచి తీసుకెళ్లి ఆమె సోదరుడు గంగాధర్, కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. ఇటీవల జరిగిన డీఆర్సీ, దిశా సమావేశాల్లో చర్చించిన అంశాలపై కలెక్టరేట్ మీటింగ్ హాలులో శుక్రవారం పలు విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన అంశాలను ఆయా శాఖలు సమీక్షించి, వాటికి త్వరితగతిన పరిష్కారాలు చూపాలన్నారు. సమావేశంలో భాగంగా ఆయా శాఖల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు, సాధించిన ప్రగతి గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డీఆర్సీ, దిశా సమావేశాలకు సంబంధించిన ఏటీఆర్‌ను వారం రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్, ఆర్డీవోలు, ఎస్‌డీసీలు తదితరులు పాల్గొన్నారు.